




కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్లు మంగళవారం విజయవాడలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

అంగన్వాడీ, మున్సిపల్, సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని

కార్మిక సంఘాల జైల్ భరో

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వేతనాలు పెంచమంటే అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేయడాన్ని వ్యతిరేకిస్తూ, సమగ్రశిక్ష ఉద్యోగుల, మున్సిపల్ కార్మికుల డిమాండ్లను తక్షణం పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరుతూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల అధ్వర్యంలో మంగళవారం పార్వతీపురంలో జైల్ భరో జరిగింది. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి నాలుగు రోడ్ల సెంటర్ దగ్గర రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషనుకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. పోలీసులు లోపలికి రాకుండా గేట్లు వేసి అడ్డుకోగా, తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా సమస్యలైనా పరిష్కరించండి, జైలులోనైనా పెట్టండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘ నాయకులు మాట్లాడుతూ రోమ్ నగరం తగలపడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్టు రాష్ట్రంలో రెండు లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు, సౌకర్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెలు చేస్తుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర అంటూ ఆటలాడుకుంటూ పట్టీపట్టనట్టు వ్యవహరించడం చూసి జగన్ సామర్థ్యంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇంటి పన్నులు, కరెంటు ఛార్జీలు, చెత్త పన్ను, నిత్యవసరాలు ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు, నిరుద్యోగాన్ని ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం ఇష్టానుసారం పెంచి ఇప్పుడు వేతనాలు పెంచమనేసరికి ఎస్మా చాటున దాక్కొని ఆకలి కడుపుతో సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై నిర్బంధం ప్రయోగించడం దారుణం అన్నారు. తక్షణం అంగన్వాడీలను ఎస్మా పరిధిలోంచి తొలగించాలని, మున్సిపల్ కార్మికులకు ధరల కనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సమగ్రశిక్ష ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, మినిమం టైమ్ స్కేల్, రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పోరాడే కార్మికులకు, ఉద్యోగులకు అండగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు అఖిలపక్షం వెన్నంటి నిలుస్తుందని, డిమాండ్లు పరిష్కరించేంతవరకు మీతో కలిసి పోరాడుతామని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణ, కోశాధికారి జి వెంకటరమణ, ప్రగతి మహిళా సంఘం నాయకులు రమణి, ఎఐటియుసి నాయకులు టి.జీవ, సూరయ్య, ఐఎఫ్‌టియు, ఎఐకెఎస్ నాయకులు నర్సింగరావు, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంఘం, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.తులసి, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు శంకర్రావు, మల్లేసు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల నిరాహార దీక్షలు



పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించిన కార్మిక సంఘాల నాయకులు

బొబ్బిలిలో 'రా... కదలిరా..

- నేడు చంద్రబాబు రాక
- బహిరంగసభకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రా... కదలిరా' కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం జిల్లాకు రానున్నారు. బొబ్బిలిలోని రాజా కాలేజి మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు ఆ పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. తెలుగు తమ్ముళ్లను భారీగా తరలించేందుకు పార్టీ నాయకులు సన్నాహాలు చేశారు. ఇప్పటికే గ్రామ స్థాయిలో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికల వాతావరణం దగ్గరపడడంతో వైసిపి, టిడిపిల ప్రచారం ముమ్మరం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే 'రా... కదిలి రా' అనే కార్యక్రమంలో భాగంగా అధినేత చంద్రబాబు మరోసారి జిల్లాకు వస్తున్నారు. ఇటీవలే భోగాపురం మండలం పోలిపల్లిలో నిర్వహించిన యువగళం విజయోత్సవ సభకు హాజరైన సంగతి తెలిసిందే.



బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

ఈసారి బొబ్బిలి వేదికగా విజయనగరం - పార్వతీపురం మన్యం జిల్లాల కేడర్‌కు బాబు దిశానిర్దేశం చేయనున్నారు. బొబ్బిలి కేంద్రం ఈ రెండు జిల్లాలకు సమాంతర దూరంలోనూ, పార్టీకి కాస్త బలమైన నియోజకవర్గంగాను గుర్తించిన పార్టీ ఇక్కడ సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్టుగా టిడిపి నాయకులు చెబుతున్నారు. బాబు వరుస పర్యటనలతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ కనిపిస్తోంది. విజయనగరం, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి ఒకింత క్లారిటీగానే ఉంది. గజపతినగరం, నెల్లిమర్ల, ఎస్.కోట ఎవరికి కేటాయిస్తారనేది తేలాల్సివుంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లోని ఆశా వహులు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బహిరంగ సభకు వస్తున్న నేపథ్యంలో బాబు దృష్టిలో పడేందుకు కూడా తహతహలాడుతున్నారు. గత నెల 20న పోలిపల్లి బహిరంగ సభ మాదిరిగానే దారిపొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నేడు జరగనున్న బహిరంగ సభల్లో కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేయడం, వైసిపిలోనూ, ప్రభుత్వంలోనూ లోపాలను, అమలుకాని హామీలను ఎత్తి చూపడమే బాబు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

స్భభా ఏర్పాట్లు పరిశీలన

బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాట్లను నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, పార్టీ పరిశీలకులు కూన రవికుమార్ పరిశీలించారు.

బాబు జిల్లా పర్యటన ఇలా..

బుధవారం ఉదయం 10.15 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టులో బయలుదేరి, 11గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి బొబ్బిలి రాజా కాలేజీ మైదానానికి 11.40గంటలకు చేరుకుంటారు. 12గంటలకు సభ ప్రారంభమై 1.30గంటలకు ముగుస్తుంది. అనంతరం 2.30గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మిగిలిన గంట వ్యవధిలో పార్టీ కీలక నాయకులు, కార్యకర్తలతో జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించే అవకాశం ఉంది.

పారదర్శకంగా సరుకుల పంపిణీ : జెసి

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు నిత్యవర సరుకుల పంపిణీ పారదర్శకంగా జరగాలని జాయింట్ కలెక్టర్ అర్.గోవిందరావు అన్నారు. మండలంలోని అంపావల్లి, పెదపెంకి గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీని మంగళవారం తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల నిల్వ, అవసరం మేరకు ఇండెంట్ జాబితాను పరిశీలించారు. ఇ - పాస్ విధానం ద్వారా లబ్ధిదారుల నమోదును తనిఖీలు చేశారు. లబ్ధిదారులకు సరిపడా బియ్యం, కందిపప్పు పంపిణీ జరుగుతుండగా పంచదార నిల్వ తక్కువ ఉండడాన్ని గుర్తించి ఎండి యు ఆపరేటర్‌ను ప్రశ్నించారు. తక్షణమే స్పందించి డిమాండ్ మేరకు పంచదార సరఫరా చేయాలని డిఎస్ఒ ఆర్.శివప్రసాద్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు అందజేయాల్సిన సరుకుల నిల్వ, తూనికలో పారదర్శకత తప్పనిసరిగా పాటించాలన్నారు. సిఎస్‌డిటిలు రేషన్ పంపిణీని పక్కాగా పర్యవేక్షించాలని అన్నారు. సరుకుల పంపిణీలో ఎక్కడైనా లోపాలువుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ రామచంద్ర, విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

ఇవిఎంలపై బిఎల్‌ఒలకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల బిఎల్‌ఒలకు ఇవిఎం వినియోగంపై ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ జి.రమేష్‌నాయుడు అవగాహన కల్పించారు. ఓటు హక్కును ఎలా ఇవిఎంలో వినియోగించుకోవాలి, వారు వేసిన ఓటు పడ్డాదో లేదో తెలుసుకోవడం ఎలా స్విచ్ నొక్కే విధానం, ఓటు పడేటప్పుడు బజార్ వెలిగి సౌండ్ వచ్చే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెండు మండలాల బిఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా సామాజిక సమతా సంకల్పం

వీరఘట్టం : మండల కేంద్రంలోని మంగళవారం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప ఆవిష్కరణలో భాగంగా ఈ సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ డి.లలితకుమారి, పిఎసిఎస్ అధ్యక్షులు భోగి లతామాణిక్య చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యులు బండి నిరుష, మంతిని హేమలత -శ్రీనివాసరావు, దూషి సుధాకర్ , పి శ్రీనివాసరావు , బి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగించినా...అరెస్టులు చేసినా..ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించినా మొక్కవోని దీక్షతో అంగన్వాడీలు తమ పోరాటాన్ని సాగిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె నెలరోజులుకు చేరుకుంటున్నా సడలని సంకల్పంతో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని విధాలుగా బెదిరించిన, సమ్మెను నిషేధిస్తూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా వారంతా అదర లేదు..బెదరలేదు. తమ సమస్యలు పరిష్కరించేవరకు పోరాడుతామని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరిస్తున్నారు.



సాలూరులో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



సీతంపేటలో నిరసన శిబిరం వద్ద రాత్రి నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

సడలని సంకల్పం

- నేటితో 30వ రోజుకు చేరనున్న అంగన్వాడీల సమ్మె
- ఎస్మా ప్రయోగించినా వెనక్కి తగ్గని వైనం
- ఉధృతంగా ఆందోళనలు

పార్వతీపురంరూరల్ : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ 29వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. నిరాహార దీక్షలో పాల్గొన్న పాలకొండ, భామిని, సీతానగరం మండలాలకు చెందిన నాయకులకు మద్దతుగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.సరళారాణి, గంట జ్యోతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పాల్గొన్నారు. ఈ జరిగిన దీక్షల్లో భద్రగిరి, బలిజిపేట మండల సెక్టార్ల అంగన్వాడీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుల హేమ ప్రభ, ధర్మవతి, గౌరీశ్వరి, గౌరీమణి, ఇందిర, శ్రీదేవి పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీలు సమ్మె ప్రారంభించి మంగళవారంతో 29వ రోజుకు చేరుకున్న స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న దీక్ష శిబిరం వద్ద సాష్టాంగ నమస్కారంతో వినూన్నత రీతిలో అంగన్వాడీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ మాట్లాడుతూ అంగన్వాడీల హక్కులపై శాంతియుతంగా దీక్ష చేస్తుంటే ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి అనవసరమైన రాద్ధాంతం చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కురుపాం, జియ్యమ్మవలస మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల సమ్మె 29వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో మండల కేంద్రంలో మంగళవారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సదర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ గౌరమ్మ, ఎం సావిత్రి, కృష్ణవేణి, లక్ష్మి, అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ చేపట్టిన ధర్నా మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు జగన్‌కు దండాలు పెడుతూ జగనన్న గోవిందా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మికసంఘం, అంగన్వాడీ నాయకులు మడక సత్యవతి, యశోద, అరుణ, పద్మ, రెడ్డి లక్ష్మితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు చేపట్టిన సమ్మె 29రోజుకి చేరింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ పార్వతి శశికళ సుజాత పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. పోర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కే గౌరీశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె నిర్మించే ప్రసక్తి లేదని యూనియన్ నాయకులు అనురాధ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె 29వ రోజు మంగళవారం కొనసాగింది. ఇప్పటికే గడిచిన అనేక రోజులుగా సమ్మెలు చేస్తున్నప్పటికీ కూడా తూతూ మంత్రంగా చర్చలు తప్ప సమస్యలు పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించకపోవడం చాలా అన్యాయం అన్నారు. కక్ష సాధింపు చర్యలు మానుకొని వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు.

వంటా వార్పుతో రాత్రి బస

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట 29వ రోజు నిరవధిక సమ్మె సందర్భంగా అంగన్వాడీలు ప్రభుత్వ మొండివైఖరిపైన నిద్రించి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు శిబిరంలో డి.రమణారావు మాట్లాడుతూ ఈనెల 11నుంచి సిఎం ఆఫీసు వద్ద ఆమరనిరాహార దీక్ష చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శిమి సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్, ఎం.కాంతారావు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె కొనసాగుతుంది. తమసమస్యలు పరిష్కరించకుంటే తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే జగన్మోహన్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి బి.అమరవేణి, నాయకులు జెస్సీబాయి, జి.శారద, లలిత, దివ్య, నిర్మల, భవా, శ్రీదేవి, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇవీ డిమాండ్లు

- ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడుతున్న కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా తెలంగాణా కన్న అదనంగా వేతనాలు పెంచాలి
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలి.
- మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలకు పెంచాలి. ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలి.
- హెల్పర్ల ప్రమోషన్లో నిర్దిష్టమైన నిబంధనలు రూపొందించాలి. రాజకీయజోక్యం అరికట్టాలి.
- సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. రూ.10 లక్షలు బీమా అమలు చెయ్యాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి
- లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలి. ఎస్ఆర్ఎస్ రద్దు చెయ్యాలి. ప్రీస్కూల్ బలోపేతం చెయ్యాలి.
- ఎస్ఆర్ఎస్, వివిధ రకాల యాప్ లను రద్దు చేసి ఒక యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలి.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి.
- పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 నుండి టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.





గుమ్మలక్ష్మీపురం, కురుపాంలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పార్వతీపురంలో దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

కళావెంకట్రావు

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు ఏమీ లేవని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కళా వెంకట్రావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సంధ్యారాణి నివాసంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని మోసగించారని చెప్పారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేదని, పండించిన ధాన్యాన్ని ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి కోసం పదివేల కోట్లు ఏర్పాటు చేస్తామని చెప్పి ఒక రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. సిఎం జగన్ యువతని ముంచేశారని, జాబ్ కేలండర్ విడుదల చేయలేదని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచిందని చెప్పారు. ఈనెల 10న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రా కదలిరా కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి పర్యటిస్తున్నారని, దీన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, టిడిపి నాయకులు పి.మోహనరావు, యుగంధర్, బి.కృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు మంగళవారం ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ప్రజల శాంతిభద్రతల లక్ష్యంగా పని చేయాలన్నారు. నాటు సారా వంటకాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నమోదవుతున్న కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బత్తిలిలో రెండు, కురుపాం మండలంలో ఒకటి, గుమ్మలక్ష్మీపురంలో ఒకటి చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటల పాటు పోలీసులు కాపలా ఉండి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టమన్నారు. కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు శివప్రసాద్, షణ్ముఖరావు, నీలకంఠం ఉన్నారు.

తాడికొండ జలపాతం వద్ద ఐటిఐ పిక్నిక్

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ జలపాతం వద్ద భద్రగిరి ఆర్ఐటిఐ విద్యార్థులు సిబ్బంది మంగళవారం వనభోజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిట్టూరి సునీల్ కుమార్ ఉన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ప్రాంగణంలో ఈనెల 10 నుంచి ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డి.శ్వేత మంగళవారం తెలిపారు. ఈనెల 10,11,12 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

గుమ్మ లక్ష్మీపురం: బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని స్థానిక హెచ్ గ్రౌండ్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మన్‌రాజు తెలిపారు.

పార్కు సుందరీకరణ పనులు పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీ పురం

మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ పరిధిలో ఉన్న సవర కోటపాడు ఉద్యానవన ఫల నర్సరీ శిక్షణ కేంద్రంలో చేపడుతున్న సుందరీకరణ పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా మంగళవారం ఉద్యానవన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో పనులు ప్రతి ఒక్కటి ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పనులు చేపట్టడంలో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. పర్యాటకుల తాకిడికి అవకాశం ఎక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. పర్యాటక నిలయాలుగా ఈ ప్రాంతం మారాలని, ఇక్కడ ప్రకృతి రమణీయతలు, వాగులు, జలపాతాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయని అన్నారు. అనంతరం ఎస్ కె పాడు ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ కింద పివిటిజీలను నమోదు చేయాలని, ఇకెవైసి చేయాలని ప్రాజెక్టు అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ శాంతీశ్వరరావు, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, భద్రగిరి ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో జాతర విజయవంతం చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారి జాతరను అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత ఆదేశించారు మంగళవారం స్థానిక చదురు గుడి సమీపంలో అమ్మవారి జాతర నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒకు ఆలయ కార్య నిర్వహణ అధికారి వివిఎస్ నారాయణ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్‌టిసి అధికారులు ప్రతి ఏడాది మాదిరిగానే 120 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అలాగే పోలీస్ శాఖ సుమారు 800 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆశాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికీ గ్రామంలోనూ సక్రమంగా పనిచేయలేదని, జాతర సమీపిస్తున్నందున ఇంకెప్పుడు పనులు పూర్తి చేస్తారని ఎఇ స్వామిని ఆర్‌డిఒ ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఎందుకు హాజరు కాలేదని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె విద్యుత్ శాఖ అధికారులను హెచ్చరించారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రత్యేక వసతులు కల్పించాలని ఆర్‌డిఒను కోరారు. గతంలో ఎవరూ పట్టించుకోలేదని వారు వాపోయారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ కెవికెగా రస్తా కుంటుబాయి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల్లో రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ సూచనలు సలహాలు ఇస్తూ ఉత్తమ సేవలందిస్తున్న మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ అవార్డు లభించింది. మంగళవారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరులో నిర్వహించిన 53వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో భాగంగా ఉత్తమ కెవికెగా అవార్డును ఉప కులపతి డాక్టర్ ఎస్.జయలక్ష్మి చేతుల మీదుగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ టిఎన్ఎస్‌కె పాత్రో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యతలు పెంచిందని, కెవికె సేవలు ఇంకా రైతులకు మెరుగ్గా అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంత రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కెవికె సిబ్బందికి అభినందించారు.



తాగునీటి కోసం రోడ్డుపై బైఠాయించిన మహిళలు

ఖాళీ బిందెలతో రోడ్లపై బైఠాయించిన మహిళలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని కొత్తవలసలో గత పది రోజులుగా తాగునీటి సరఫరా జరగకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ఆధ్వర్యంలో కొత్తవలస ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి మున్సిపల్ అధికారుల పని తీరుపై మండిపడుతూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న పట్టణ సిఐ కృష్ణారావు, మహిళా ఎస్ఐ సంతోష్ కుమారి ప్రత్యేక పోలీస్ బలగాలతో ఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర, టిడిపి నాయకులు కోలా మధు తదితర నాయకులు, మహిళలకు మద్దతుగా నిలబడడంతో పోలీసులకు, నాయకులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఎట్టకేలకు పోలీసులు సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని మహిళలకు నచ్చజెప్పి నిరసన కార్యక్రమాన్ని విరమింప చేశారు.

ఇష్టానుసారంగా రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -మక్కువ

మండల కేంద్రమైన మక్కువ ప్రధాన రహదారిలో చేపడుతున్న తాత్కాలిక మరమ్మతు పనులు వంకరగా చేస్తూ వారికి నచ్చినట్లుగా చేసుకుపోతున్నారని, నిధులు దుర్వినియోగమే తప్ప ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదని టిడిపి సీనియర్ నాయకులు నాయకులు మామిడి ప్రసాద రావు నాయుడు విమర్శించారు. రహదారులకు ఇరువైపులా ఒకేలా కాలువలు తీయాల్సి ఉన్నప్పటికీ అలా చేయడంలేదన్నారు. వైసిపి నాయకులకు గిట్టని వారికి నష్టపరిచేలా, వారి ఇష్టపడే వారికి ఏమీ జరగనట్లు కాలువ తీతలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాలువల్లో పూడికను పట్టించుకోవడంలేదని, కొత్తగా కాలువ తవ్వితే వచ్చే ప్రయోజనం కంటే చాలామందికి నష్టం చేకూరుతుందని ఆయన విమర్శించారు. నాలుగు రోడ్ల సెంటర్ నుండి సువర్ణముఖి నది వరకు ఒకేలా కాలువలు తీసుకుపోయినట్లయితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రస్తుతం చేస్తున్న పనులు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి ఏటా జాతర సమీప సమయంలో తూతూ మంత్రంగా పనులు చేపట్టి నిధులు మింగే స్వాహా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పనుల్లో నాణ్యత పాటించాలని డిమాండ్ చేశారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజలకు నవరత్నాలు అందించాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు నవరత్నాలు అందించిన ఘనత జగనన్నదేనిని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రజాసంకల్పయాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్ విగ్రహానికి ఎమ్మెల్యే సమక్షములో వైసిపి శ్రేణులు మధ్య నాటి పాదయాత్రను గుర్తు చేస్తూ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి, అనంతరం రైతు బజార్ ఎదురుగా ఉన్న అనాధాశ్రమంలో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి నిర్భాగ్యులకు, అనాధలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు, ఎఎంసి చైర్మన్లు, కౌన్సిలర్లు, స్టేట్ డైరెక్టర్లు, ఎంపిటిసిసభ్యులు, సర్పంచులు, జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్రం లో పేదల సంక్షేమమే పరమావధి గా ప్రభుత్వం పని చేస్తున్నదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చెప్పారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక బోసుబొమ్మ జంక్షన్ లో కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పాలవలస మధుసూదనరావు, పప్పల లక్ష్మణరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, వైసిపి నాయకులు హరి బాలాజీ, కొల్లి వెంకటరమణ, లింగాల సింహాచలం పాల్గొన్నారు.

నేడు దోనుబాయిలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎఇ జి.నీలిమ తెలిపారు. 33కెవి, 11కెవి విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

పెంచిన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు మండలంలోని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన పింఛనుతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. అనంతరం సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ప్రభుత్వమే ధాన్యం రవాణా చేయాలి

కలెక్టరేట్ వద్ద రైతుసంఘం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతుల వద్ద కొన్న ధాన్యాన్ని ప్రభుత్వమే రవాణా చేసి మిల్లులకు తరలించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలైనప్పటికీ నేటి వరకు రైతులే తాము స్వయంగా రవాణా ఏర్పాట్లు చేసుకుని ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్నారు తప్పితే ప్రభుత్వం పూర్తిస్థాయిలో రవాణా ఏర్పాటు చేయడం లేదని అన్నారు. దీనివల్ల రైతులు ప్రైవేటు వాహనాలు ఏర్పాటు చేసుకొని, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా చార్జీలు కంటే అదనంగా డబ్బులు చెల్లించుకుని రవాణా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనివల్ల రైతులకు ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి గానూ డబ్బులందక రైతులు నానా అవస్థలు పడుతున్నారని, సంక్రాంతి సందర్భంగా రైతుల వద్ద డబ్బులు లేక ఇబ్బందుల గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రైతుల ధాన్యానికి చెల్లించాల్సిన డబ్బులతో పాటుగా రవాణా, హమాల చార్జీలను కూడా చెల్లించాలని కోరారు. ఇదివరకే రైతుల నుంచి మిల్లర్లు అధికంగా తీసుకున్న ధాన్యానికి గాను డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకొని, రైతుల నుంచి మిల్లర్లు క్వింటాలుకు 5 కేజీలు చొప్పున అధికంగా డిమాండ్ చేస్తున్నారని అన్నారు. అనంతరం సమస్యను తెలియజేస్తూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గేదెల సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ మండలంలోని చాపరాయిగూడ, బాపనగూడ, దీసరిగూడ, చినతోలుమండ, అర్నాడ, అర్నాడవలస, దంగభద్రవలస, పసుపువానివలస, చిలకలవలస, పొట్టిదొరవలస, చంద్రశేఖర్‌రాజ పురం, గంగరాజుపురం, గదబవలస గ్రామాలకు నేటికీ రోడ్డు మార్గం లేదన్నారు. దీంతో గిరిజనులు బయట ప్రాంతాలకు రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భిణీలు, గిరిజనులకు అనారోగ్యం వాటిల్లితే డోలీలు కట్టి అతి కష్టమ్మీదకిందికి వైద్యం కోసం తీసుకు వస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అత్యవసర సమయంలో వైద్యమందక కొంత మంది మార్గమధ్యనే చనిపోతున్న ఘటనలు బాధాకరమన్నారు. అటవీ ఉత్పత్తులు, చింతపండు, జీడి పిక్కలు, ధాన్యం, కందులు, మినుములు అమ్ముకోవడానికి, రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి తలపైన మోసుకొని అతి కష్టమ్మీద కొండలు ఎక్కి దిగుతున్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్ మాట్లాడుతూ మండలంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఉన్నపటికీ ఆమె ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని, తమకు అనుకూలంగా ఉన్న గ్రామాలకు రోడ్లు మంజూరు చేయడం, అనుకూలంగా లేని గ్రామాలకు రోడ్లు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. సొంత మండలంలోనే గిరిజన గ్రామాలకు రోడ్లు లేకపోవడం సిగ్గుచేటన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేసేవరకు గిరిజనుల తరుపున పోరాటం చేస్తానని అన్నారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి గొరపాడు సోమయ్య, గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.సీతారాం, వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి బి మోహన్‌రావు, గిరిజనులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

బిజెపిని ఓడించండి : కాంగ్రెస్

గుమ్మలక్ష్మీపురం: బిజెపిని ఓడించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాలచం అన్నారు. విశాఖపట్నంలో ఐదు జిల్లాల డిసిసి అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య బద్దంగా ఎస్సీ, ఎస్టీ, బీసీసి, మైనార్టీలకు అందాల్సిన రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన ప్రజాస్వామ్యాన్ని పక్కనపెట్టి బిజెపి ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఖండిస్తూ లౌకికవాదం ప్రజాస్వామ్యం పరిరక్షించాలని పిలుపునిచ్చారని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలి అలాగే దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలనే నినాదంతో సభలో పలువురు వక్తలు ప్రసంగించారన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జెడి శీలం, కొప్పులరాజు, సిడబ్ల్యుసి, ఎఐసిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

23 నుంచి 104, 108 ఉద్యోగులు సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తమను ఆప్కాస్ లో చేర్చాలని, లేకపోతే ఈనెల 23 నుండి సమ్మె చేస్తామని 104 జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, ప్రసాదులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారికి వారి కార్యాలయంలో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో యూనియన్ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో 104 ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్లో చేరుస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. గతంలో వైద్య, ఆరోగ్యశాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాల్లో 104 ఉద్యోగులకు వెయిటేజీని ఇచ్చారు కాని ప్రస్తుత కాంట్రాక్ట్ నియామకాల్లో ఎటువంటి వెయిటేజి ఇవ్వకుండా 104 ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ ఆందోళనలో భాగంగా ఈనెల 11న జగనన్నకు చెబుదాంలో వినతులు, 14న ప్రజాప్రతినిధులకు, మంత్రులకు సామూహిక వినతులు, 16న సిఎంకు మెయిల్ ద్వారా వినతులు, 22న స్పందనలో సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. అనంతరం ఈనెల 23న సమ్మె నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు 104, 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

పండగ పూటా పంగనామాలేనా..?

15వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్, వాటర్ సెక్షన్ కార్మికుల 15వ రోజు సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల సమ్మె శిబిరం వద్ద వినూత్నంగా పంగనామాలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేషు, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వంగపండు అప్పలనాయుడు, మేడిశెట్టి కృష్ణ, అరసాడ తాతబాబు, క్రాంతి, రమేష్, శ్రీను, నాగవంశం మల్లేసు, బంగారు రవి, నిర్మల ఇప్పలమ్మ, పాపులమ్మ పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమ్మె 15రోజుకు చేరింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు నుదుట పంగనామాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు మాట్లాడుతూ పట్టణాల్లో అపారిశుధ్యం తాండవిస్తోందని, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదని అన్నారు. సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని చెప్పారు.వెంటనే డిమాండ్లను ఆమోదించాలని డిమాండ్లను ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో పోలరాజు, శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.



సాలూరులో పంగనామాలతో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

జెఎఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలపాలిట వరమని, కావున ప్రతి సచివాలయంలో ఏర్పాటు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి. జగన్నాథరావు అన్నారు. మంగళవారం మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గుమ్మ సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీసి అనంతరం వైద్య సిబ్బందికి శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బి.ప్రజ్ఞ, శేషగిరిరావు, పవన్ (జనరల్ సర్జన్) సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : నిరుపేదల ఆరోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. మండలంలోని సారిక సచివాలయంలో జరిగిన జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదల ఆరోగ్యానికి సంపూర్ణ భరోసా అని తెలిపారు. ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో అందులో నిర్వహించే వైద్య పరీక్షల గురుంచి తెలుసుకుంటూ ప్రతి ఒక్కరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులను అందించాలని కోరారు. అనంతరం కొత్త పింఛన్లు పంపిణీ, కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ఎంపిడిఒ పార్వతి, సర్పంచ్ సారిక రాజారావు, ఎంపిటిసిలు పరిమళ, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని జానుమల్లువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించి అక్కడ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. స్పాట్ డయాగ్నోసిస్ పరీక్షల ద్వారా కొత్తగా గుర్తించిన అసాంక్రమిక వ్యాధులున్న వారిని గుర్తిస్తే సిబ్బంది వారి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సూచించారు. ల్యాబ్ వద్ద రోగులకు చేపట్టిన రక్త, మూత్ర పరీక్షల నివేదికలను రికార్డుల్లో పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రభుతేజ, ఇఒపిఆర్డి కెకె. కుమార్ వర్మ , సర్పంచ్ వై.వెంకటనాయుడు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ స్వరూప్, డాక్టర్ పవన్, పంచాయతీ సెక్రటరీ టి.అశోక్,శంకరరావు, ఇఒ సూర్యనారాయణ, వైద్య, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఎమ్మెల్యే ఇంటి ముందు ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం డిమాండ్లతో సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇంటి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు పోలినాయుడు, బివి రమణ, ఎం ఈశ్వరరావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 21వ రోజుకు చేరుకుందని, అయినా ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడాలని, ఎమ్మెల్యే చొరవచేసి ప్రభుత్వంతో మాట్లాడి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. చలో విజయవాడ సందర్భంగా సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్‌పాలసీ అమలు చేసి సర్వీస్ రూల్స్ రూపొందించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గతంలో ప్రకటించిన విధంగా 23శాతం జీతాలను సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు పెంచాలని, మన్యం జిల్లాలో బకాయి ఉన్న రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు లక్ష్మణరావు, శంకర్రావు, ఆచారి, భానుప్రకాష్, శాంతకుమారి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక పై అత్యాచార యత్నం

నేరాలు ఘోరాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని లక్ష్మీనారాయణపురానికి చెందిన 15 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నం చేసినట్లు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై దినకర్ తెలిపిన వివరాల ప్రకారం కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన డీసరి ప్రసాద్ తన అత్తవారి గ్రామమైన లక్ష్మీనారాయణ పురానికి రాకపోకలు చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం పార్వతీపురం పట్టణంలో పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న బాలికను కృష్ణపల్లి దాటిన తర్వాత దారి పలకరించి తను ఎలాగో ఇంటికి వెళ్తున్నాను కనుక వాహనంపై ఇంటి వద్ద దింపేస్తానని చెప్పి బైక్ ఎక్కించుకొన్నాడు. లక్ష్మీనారాయణ పురం గ్రామ శివారులో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో వాహనాన్ని ఆపి బాలికపై అత్యాచారాన్ని చేయడానికి ప్రయత్నించాడు. బాలిక ప్రతిఘటించి కేకలు వేయడంతో స్థానికులు కొందరు చేరుకొని బాలికను ఇంటిదగ్గరకు చేర్చి, అత్యాచారానికి పాల్పడ్డ ప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి, సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురం సమీపాన మంగళవారం ఇటుకుల తయారీ కోసం ట్రాక్టర్ ఇంజిన్‌తో మట్టి తొక్కుతుండగా ముందు భాగం చక్రాలు పైకి లేచి బోల్తా పడడంతో కడకల్లా గ్రామానికి ముచ్చి వంశీ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు గౌరీశ్వరి, సింహాచలం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ విషయమే స్థానిక ఎస్ఐ ఎం.గోవిందరావును వివరణ కోగా, మృతి చెందిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

1700 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఒడిషా నుంచి అక్రమంగా నాటు సారాను తీసుకొచ్చి అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండలంలోని అడారుకు చెందిన మండంగి శ్రీరాములును అదుపులోకి తీసుకుని 1700 సారా ప్యాకెట్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు. శ్రీరాములును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రానికి చెందిన దాసరి అప్పన్న (52) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఎఎస్ఐ బెల్లాన ముసలయ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన దాసరి అప్పన్న మద్యానికి బానిసై ఇంటి బాధ్యతలు పట్టించుకోకుండా అదే పనిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య సోమమ్మ శనివారం మందలించింది. మనస్థాపానికి గురైన అప్పన్న శనివారం పురుగులు ముందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య పాచిపెంట పిహెచ్‌సికి తరలించి మెరుగైన చికిత్స కోసం సాలూరు, అక్కడ నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రుకు చికిత్స నిమిత్తం తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ అప్పన్న మృతి చెందాడు. సోమమ్మ ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ ఆడిట్ నిర్వహణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని 27 పంచాయతీల్లో 2022-23లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో 17వ సోషల్ ఆడిట్ నిర్వహించారు. రూ.18 కోట్లతో చేపట్టిన 3వేల పనులపై సోషల్ ఆడిట్ జరిగింది. గ్రామాల్లో ఎస్ఆర్పీలు ప్రజల నుంచి సేకరించిన పనులు, జరిగిన తీరు, కూలీల వేతనం, చేపట్టిన అభివృద్ధి పనులు నివేదిక వివరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎపిడి చందర్రావు, ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఎపిఒ శివరామకృష్ణ, ఎస్ఆర్పిలు ఉన్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో మంగళవారం సంక్రాంతి పండుగ నిర్వహించారు. మూడు రోజుల పండుగ ఎలా సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలో విద్యార్థులు చేత చేయించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సంక్రాంతి ఉట్టిపడేలా నిర్వహించారు. గొబ్బెమ్మలు, ముగ్గులు వేసి సాంప్రదాయ దుస్తులతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణీలకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ వంటి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గర్భిణులకు స్థానిక శ్రీ సత్య సాయి సేవ సమితి నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.



గ్రామంలో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట, జోగింపేట తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగ సమయంలో ప్రజలు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని వీధుల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టడం, తాగునీరు అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.కృష్ణ, కె.సింహాచలం, పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకృష్ణ, కె.అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.